ప్రజాశక్తి

శుక్రవారం 12 జులై 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

సుగర్ ఫ్యాక్టరీలకు శాశ్వత పరిష్కారం

ఇథనాల్ తయారీకి ఉపయోగించాలి : సిఎం చంద్రబాబునాయుడు

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా విశాఖ, అనకాపల్లి జిల్లాలకు వచ్చిన చంద్రబాబు గురువారం రోజంతా వివిధ కార్యక్రమాలతో బీజీ షెడ్యూల్ నిర్వహించారు. తొలుత అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం దార్లపూడి వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువను పనులు పరిశీలించారు. తర్వాత విశాఖలో మెడ్ టెక్ జోన్‌లో గ్లోబల్ మెడ్ టెక్ యూనివర్శిటీని, సైక్లో ట్రాన్ సెంటర్లను ప్రారంభించారు. సాయంత్రం 6.30గంటలకు ఎయిర్ పోర్టులో విశాఖపట్నం జిల్లా ఉన్నతాధికారులు, పోర్టు అధికారులతో సమావేశం అయ్యారు.



మెడ్ టెక్ జోన్‌లో మెడికల్ మెటీరియల్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, గ్రేటర్ విశాఖ బ్యూరో

అనకాపల్లి జిల్లాలో రైతులకు న్యాయం జరిగేలా వారి భాగస్వామ్యంతో మూతపడ్డ మూడు సుగర్ ఫ్యాక్టరీలలో ఇథనాల్ తయారీకి ఉపయోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రైతులకు న్యాయం చేయడం ఎన్‌డిఎ ప్రభుత్వ మొదటి కర్తవ్యమన్నారు. ఎస్.రాయవరం మండలం, దార్లపూడి వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ అక్విడెక్ట్ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుగర్ ఫ్యాక్టరీలు మూతపడ్డంతో రైతులకు అన్యాయం జరిగిందని, ఉద్యోగులకు జీతాల్లేవనే పరిస్థితిలేకుండా, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చేసి చూపిస్తామని చెప్పారు. ఈ పని జరిగేలా ఎమ్మెల్యేలతో మాట్లాడే బాధ్యత ఎంపీ సిఎం రమేష్, మంత్రి అనితకు అప్పగిస్తున్నట్లు తెలిపారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారి అనకాపల్లి జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు దార్లపూడి హెలిపాడ్ వద్ద మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఘనస్వాగతం పలికారు. శాసనసభ స్పీకర్ సిహెచ్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయ్‌కుమార్, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, విశాఖపట్నం రేంజ్ డిఐజి విశాల్ గున్ని, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్‌పి కెవి మురళీకృష్ణ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

గ్లోబల్ యూనిక్ హబ్‌గా మెడ్ టెక్ జోన్

వైద్య పరికరాల (మెడికల్ డివైసెస్) తయారీలో గ్లోబల్ యూనిక్ హబ్‌గా విశాఖ మెడ్ టెక్ జోన్ అవతరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. గురువారం ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా సాయంత్రం 5గంటలకు విశాఖలోని మెడ్‌టెక్ జోన్ సిబ్బంది, భాగస్వాములను ఉద్దేశించి ప్రసంగించారు. గ్లోబల్ మెడ్ టెక్ యూనివర్శిటీని, సైక్లో ట్రాన్

మిగతా 2లో..

ఎంత వరకు నమ్మొచ్చు!

వైజాగ్ స్టీల్‌పై ఇంకెన్నాళ్లీ దాగుడుమూతలు...

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ స్టీల్‌ప్లాంట్ దేశాభివృద్ధికి సాయపడతుందని, దీనిపై అనేక మంది అధారపడుతున్నారని, ఇది మూతపడదంటూ మాత్రమే కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి చెప్పారు. గురువారం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సందర్శించిన అనంతరం అధికారులతోనూ, యూనియన్ నాయకులతో సమావేశమైన స్టీల్ మంత్రి ప్రైవేటైజేషన్‌పై ఎవరు ప్రకటన చేయాలన్న విషయాన్ని సైతం వెల్లడించారు. ప్రైవేటైజేషన్, క్లోజర్ వంటి మాటల ప్రశ్నే లేదు అన్న అర్థంలో మాట్లాడారు. మోడీ దీన్ని 100శాతం సామర్థ్యంతో నడిపేందుకు కృషిచేస్తున్నారని మాత్రం తెలిపారు. ప్రధాని దృష్టికి తన అధ్యయన విషయాలను తీసుకెళతానని, నిర్ణయం మోడీదేనని భారం అంతా ఉక్కు మంత్రి ఆయనపై వేశారు. అయితే ఈ మాటలు ఎంతవరకూ నమ్మొచ్చు అనే సందిగ్ధంలో కార్మికులు, ఈ ప్రాంత ప్రజలు పడ్డారు. ఇది సహజమే. కూటమికి విశాఖ ప్రజలు భారీ స్థాయిలో మెజారిటీలు ఇచ్చి పార్లమెంట్ మెంబర్‌కు 5లక్షలు పైన ఇచ్చారని, గాజువాక ఎమ్మెల్యేకు లక్ష మెజారిటీ ఇచ్చారని విశాఖ ప్రజల రుణం తీర్చుకుంటానని పదేపదే గెలిచాక చంద్రబాబు చెప్పడం తెలిసిందే. కూటమిలోని జనసేన అధినేత పవన్, తాను కలిసి ఢిల్లీలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పైనే ప్రత్యేక సమావేశం ప్రధానితో ఎందుకు ఏర్పాటు చేసి ప్రైవేటీకరణ ప్రక్రియను ఆపుతున్నట్లు ప్రకటన చేయడం లేదన్న ప్రశ్న సర్వత్రా వినిపిస్తోంది.

కేంద్ర మంత్రి ఏం చెప్పారు?

ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటామని కేంద్ర మంత్రి ఎక్కడా చెప్పలేదు. ప్రధాని మోడీకి ప్లాంట్‌లో పరిస్థితులు వివరిస్తామని మాత్రం కుమారస్వామి మీడియా ముందు చెప్పారు. సెయిల్‌లో విలీనం చేయాలన్న డిమాండ్‌ను తాను పరిగణలోకి తీసుకున్నట్లు తెలిపారు. అదే సందర్భంలో స్టీల్‌ప్లాంట్‌పై గతంలో నిర్ణయం ప్రధాని చేసినందున ప్రస్తుతం కూడా 2 నెలల వ్యవధి కావాలని ఈ సందర్భంగా కుమారస్వామి కోరారు. ప్రైవేటీకరణ ఆపుతున్నట్లు ప్రకటించడానికి కూటమి భాగస్వామ్య పక్షాలైన టిడిపి, జనసేన నేతల నుంచి స్పష్టమైన హామీ ఏదీ ఇంతవరకూ రాలేదు. ప్రైవేటీకరణకు వ్యతిరేకమని మాత్రమే చెబుతున్నారు. అంతకు మించి మోడీతో ప్రకటన చేయిస్తామన్న భరోసాను కూటమి నేతలు ఇవ్వలేకపోవడం కనిపిస్తోంది. కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి కూడా మూతకు గురికాదని, 100శాతం సామర్థ్యంతో నడిపేలా మోడీ కృషిచేస్తారన్నది మాత్రం కుండబద్దలు కొట్టారు. అంటే ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చేసైనా సరే 100శాతం సామర్థ్యంతో అంటే అప్పుడు సొంత గనులు ఏర్పాటుచేసుకుని నడిపే అవకాశం ఉంటుందన్న సందేహం పలువురిలో కలుగుతుంది.

సిపిఎం నాయకుల గృహనిర్బంధం

వార్త మెయిన్‌లో..

బాలిక హంతకుడు సురేష్ ఆత్మహత్య

వార్త మెయిన్‌లో..

వందే భారత్‌కు సాంకేతిక లోపం

వార్త మెయిన్‌లో..

పలుచోట్ల జనాభా దినోత్సవ ర్యాలీలు

వార్త 7లో..

విజయనగరం-రాయగడ సెక్షన్‌లో డిఆర్‌ఎం తనిఖీలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ గురువారం వాల్తేర్ డివిజన్ లోని విజయనగరం-రాయగడ రైల్వే సెక్షన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆ సెక్షన్‌లో ప్రస్తుతం జరుగుతున్న మూడో లైన్ పనుల పురోగతి, స్టేషన్ల పునరాభివృద్ధి కార్యక్రమాలు, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదలలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం రాయగడ రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, సర్క్యులేటింగ్ ప్రాంతాలు, పార్కింగ్ సదుపాయాలు, స్టేషన్ భవనాల మెరుగుదల, రైల్వే కాలనీ అభివృద్ధి తదితర అంశాలను పరిశీలించారు. కెయుట్‌గూడ స్టేషన్‌లో తనిఖీ సందర్భంగా, సౌరభ్ ప్రసాద్ భద్రతా ఆడిట్ నిర్వహించారు. అనంతరం విజయనగరం నుంచి రాయగడ వరకు విండో-ట్రైలింగ్ తనిఖీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎడిఆర్‌ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



కెయుట్‌గూడ స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న డిఆర్‌ఎం

విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్నీ బదిలీ

ఆ పోస్టులోకి గోపీనాథ్ జట్టి రాక

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖపట్నం రేంజ్ డిఐజిగా విధులు నివహిస్తున్న 2010 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన విశాల్ గున్నిని తదుపరి పోస్టింగ్ ఇచ్చే వరకు డిజిపి కార్యాలయానికి రిపోర్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరాబ్ కుమార్ ప్రసాద్ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం గ్రేహౌండ్స్ డిఐజిగా విధులు నిర్వహిస్తున్న 2008 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన గోపీనాథ్ జట్టిని విశాఖపట్నం రేంజ్ డిఐజిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.



గోపీనాథ్ జట్టి

జివిఎంసి కార్యక్రమాలపై ఫైనాన్స్ కమిషన్ సమీక్ష

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై ఆంధ్రప్రదేశ్ 5వ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ గురువారం జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో సమీక్ష నిర్వహించింది. 5వ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీ కెవి.రమణారెడ్డి, సభ్యులు ప్రొఫెసర్ ఎం.ప్రసాద్‌రావు, ఎంవిఎన్.పద్మారావు, కె.కృపారావు నిర్వహించిన సమీక్ష సమావేశంలో జివిఎంసి డిసిఆర్ శ్రీనివాసరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్సు వాసుదేవరెడ్డి ఇతర అధికారులు పాల్గొని జివిఎంసి రెవెన్యూ, స్మార్ట్ సిటీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, పట్టణ ప్రణాళిక, తాగునీరు తదితరాలపై చర్చించారు. 5వ స్టేట్ కమిషన్ సభ్యులకు జివిఎంసి డిసిఆర్ వివరిస్తూ జివిఎంసి రెవెన్యూ పెంపునకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లలో జివిఎంసి వృద్ధిరేటు, ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, వాణిజ్యసముదాయాల గుత్తలు, తాగునీటి పన్నులు తదితర ఆదాయాలపై వివరణ ఇచ్చారు. తదుపరి జివిఎంసి ఆదాయం, జమలు, వ్యయాలపై ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్సు వాసుదేవరెడ్డి కమిషన్ సభ్యులకు వివరించారు.

విశాఖ నగరం 8వ ర్యాంకు స్మార్ట్ సిటీగా గుర్తింపు పొందిందని, రూ.వెయ్యి కోట్లతో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పనులు చేపట్టామని, ఇప్పటివరకు రూ.649 కోట్లు వెచ్చించి 57 ప్రాజెక్టులను పూర్తి చేసామని, మరో నాలుగు ప్రాజెక్టులు పూర్తి కావస్తున్నాయని కమిషన్ సభ్యులకు తెలిపారు.

అనంతరం కమిషన్ సభ్యులు మాట్లాడుతూ, జివిఎంసి చేపట్టే కార్యక్రమాలలో ఉన్న లోటుపాట్లను ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఫైనాన్స్ అడ్వైజర్ మల్లికాంబ, కార్య నిర్వాహక ఇంజినీర్ సుబ్బారావు, డిసిపి రామకృష్ణారెడ్డి, స్మార్ట్ సిటీ మేనేజర్ ఆనంద్, ఎస్ఆర్ యుటిం కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

సుగర్ ఫ్యాక్టరీలకు శాశ్వత పరిష్కారం

సెంటర్లను ఈ సందర్భంగా ఇక్కడ ప్రారంభించారు. దేశంలోని 20 రాష్ట్రాలకు ఇక్కడి నుంచే మెడికల్ డివైజెస్ ఎంఆర్ఐ, సిటి స్కాన్ వంటివి ఉత్పత్తయి సరఫరా అవుతున్నాయని, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వమే వినియోగించకపోవడం దారుణమని పేర్కొన్నారు. హెల్త్ కేర్‌లో 28 రకాల వైద్య పరికరాల తయారీ జరుగుతుండడం మంచి పరిణామమన్నారు.

మెడ్ టెక్ సిఇఒ జితేంద్ర శర్మ స్వాగతోపన్యాసం చేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిదని కొనియాడారు.

పారిశ్రామిక వేత్తను ప్రోత్సహిస్తాం

గత ప్రభుత్వం మాదిరిగా పెట్టుబడులను అడ్డుకునే ప్రభుత్వం తమది కాదని, రాష్ట్రాభివృద్ధి కోసం పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించి తగిన గౌరవం ఇస్తామని అటు కేంద్రం, ఇటు రాష్ట్రం మీకు అండగా ఉంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సిఐఐ ప్రతినిధులకు భరోసా ఇచ్చారు.

ఎయిర్‌పోర్టులో అధికారులతో సమీక్ష

గురువారం సాయంత్రం 6.30గంటలకు ఎయిర్ పోర్టులో విశాఖపట్నం జిల్లా ఉన్నతాధికారులు, పోర్టు అధికారులతో సమావేశం అయ్యారు. గత ఐదేళ్లలో ఉత్తరాంధ్రకు తీవ్ర నష్టం జరిగిందని తాగునీటి ప్రాజెక్టులన్నీ మూలనపడ్డాయని చెప్పారు. పుష్కర లిఫ్ట్ నుంచి అనకాపల్లికి నీరు తేవాలంటే రూ.800కోట్లు ఖర్చుచేయాలని, ఇది పూర్తయితే 2 లక్షల ఎకరాలకు నీరొస్తుందని తెలిపారు. 2026 నాటికి భోగాపురం ఎయిర్ పోర్టు పూర్తిచేస్తామన్నారు. ట్రైబల్ యూనివర్శిటీకి గతంలో ఎక్కడైతే స్థలం ఇచ్చామో పనులు అక్కడే మొదలుపెడతామని చెప్పారు. రైల్వేజోన్‌కు అవసరమైన భూమి ఇవ్వలేదనే వివాదం ఉందని, వారికి ఆమోదయోగ్యమైన స్థలం ఇచ్చి రైల్వే జోన్ పనులను చేపడతామని తెలిపారు. పంచ గ్రామాల సమస్యను, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని అధికారులకు తెలిపారు. దక్కన్ క్రానికల్ కార్యాలయం ఎదుట ఇటీవల టిడిపి శ్రేణుల నిరసనలను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ, తప్పు చేసిన వారి ఆఫీసుల వద్ద నిరసనలు అవసరం లేదని చట్ట ప్రకారం ముందుకెళదామని సూచించారు. విశాఖ పోర్టులో పొల్యూషన్‌ను తగ్గించాల్సి ఉందని దీనిపై ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలన్నారు. సింహాచలం భూముల్లో చాలామంది ఇల్లు కట్టుకున్నారని అన్నీ పరిశీలించి అనుమతులివ్వాలని సూచించారు.

విశాఖలో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఒక్క రోజు పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం విశాఖపట్నం విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఘన స్వాగతం లభించింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులు పరిశీలన అనంతరం ఆయన హెలికాప్టర్ ద్వారా నేరుగా ఏపీ మెడ్ టెక్ జోన్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు 3:52 గంటలకు చేరుకున్నారు. ఈ క్రమంలో స్థానిక నేతలు, అధికారులు పుష్పగుచ్చాలు అందజేసి ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్, పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ రామారావు, జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ ఎస్.బాగ్చి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, టిడిపి నేతలు గండిబాబ్జి, సీతంరాజు సుధాకర్, కిడారి శ్రావణ్ కుమార్ తదితరులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం మెడ్ టెక్ జోన్ పరిధిలోని కలాం కన్వెన్షన్ సెంటర్‌కు కాన్వాయ్ ద్వారా చేరుకున్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-సీతమ్మధార : వినియోగదారులకు అంతరాయాలు లేకుండా, నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలకనుగుణంగా సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్ల పర్యవేక్షక ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల వరకు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా అంతరాయాలను నివారించేందుకు పలు సూచనలు చేశారు. జిల్లాలవారీగా తరచూ ఏర్పడుతున్న అంతరాయాలను గుర్తించేందుకు 33 కెవి ఫీడర్స్, 11 కెవి ఫీడర్స్‌ను ఎంపిక చేసుకొని వాటిని సర్వే చేసి లోపాలను పిఎంఐ సర్వే మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారని తెలిపారు. ఇందులో భాగంగా గాలి వీసేటప్పుడు చెట్ల కొమ్మలు తగలడం, ఒరిగిన స్తంభాలు, తుప్పుపట్టిన స్తంభాలు, పొట్టి స్తంభాలు, స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండి వేలాడుతున్న వైర్లు, ఇన్సులేటర్ పగుళ్లు, సపోర్ట్ వైర్లు, సపోర్ట్ స్తంభాలు లేకపోవడం నమోదుచేసి వాటిని త్వరితగతిన సరిచేసి అంతరాయాలను పూర్తిగా తగ్గించి వినియోగదారులకు మెరుగైన సరఫరాను అందించేందుకు ఆదేశాలిచ్చామన్నారు.

పోర్టు ఆధునికీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో చేపట్టిన ఆధునీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అగ్రికల్చర్, అగ్రికల్చర్, ఫిషరీస్ కార్యదర్శి ఎం.బాబు పోర్టు అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం రూ.170 కోట్లతో చేపట్టిన ఫిషింగ్ హార్బర్ ఆధునిక పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఇప్పటికే ఈ పనులు జాప్యం జరిగాయని, ఎప్పటిలోగా పూర్తి చేస్తారని ప్రశ్నించగా పోర్టు అధికారులు బదులిస్తూ 2025 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. చెప్పిన గడువు కంటే నాలుగైదు నెలలు ముందుగానే ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా వేలం షెడ్లను త్వరగా పూర్తిచేయాలన్నారు. ఫిషింగ్ హార్బర్‌లో లైటింగ్, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. జెట్టీల వద్ద చాలాకాలంగా మునిగిపోయిన వెసల్స్‌ను త్వరగా బయటికి తీయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ కార్యదర్శి, చీఫ్ ఇంజనీర్ హరిష్ణ, సూపరింటెండెంట్ ఇంజనీర్ వికాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల డీజిల్ సబ్సిడీ విడుదల చేయాలి

ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు రావలసిన డీజిల్ సబ్సిడీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎం.బాబుకు మెకనైజెడ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ వినతి పత్రం అందించారు. విశాఖపట్నానికి సంబంధించి డీజిల్ సబ్సిడీ బకాయిలు రూ.2 కోట్ల 78 లక్షలు ఉన్నాయని వివరించారు.

మంచినీటి కలుషితాన్ని అరికట్టండి

ప్రజా ఆరోగ్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశం విజ్ఞప్తి

ప్రజాశక్తి-విశాఖపట్నం : మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధిలో అనేక ప్రాంతాల్లో మంచినీటి పైపులు మురుగునీటితో కలవటం వల్ల నీరు కలుషితమై ప్రతిరోజు అనేక మంది తీవ్ర అనారోగ్యానికి గురౌతున్నారని, దీన్ని అరికట్టాలని ప్రజా ఆరోగ్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్‌చేసింది. ప్రభుత్వం నిర్మించిన జెఎన్ఎన్‌యుఆర్ఎం, ఆర్‌జికె, వాంబేకాలనీల్లో శానిటేషన్ నిర్వాహణ అధ్వానంగా ఉండటంతో ఆప్రాంతాలు తీవ్ర దుర్గంధంతో నిండిపోయాయని వక్తలు తెలిపారు. జివిఎంసి అధికారులు తక్షణం స్పందించి మంచినీరు కలుషితం కాకుండా, పారిశుద్ధ్యం మెరుగుదలకు, అంటువ్యాధులు నివారణకు 15 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని జివిఎంసి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ప్రజా ఆరోగ్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు విజ్ఞప్తి చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో డాక్టర్ పి.రామారావు, డాక్టర్ పి.శ్రీనివాస్, డాక్టర్ అన్వేష్‌బాబు, సత్యనారాయణ, కాళిదాసు చంద్రమౌళి, కె.సంతోష్‌కుమార్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

కెజిహెచ్‌కు వితరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర మెడికల్ కాలేజీ, కార్డియాలజీ పూర్వ విద్యార్థి డాక్టర్ ఎ.సురేష్, (కార్డియాలజిస్ట్) రూ.1.4 లక్షలు విలువ చేసే తాత్కాలిక పేస్ మేకర్‌కు అవసరమైన పల్స్ జనరేటర్, లెడ్ పరికరాలను కెజిహెచ్ కార్డియాలజీ విభాగం ఐసియుకు విరాళంగా అందించారు. ఈ తాత్కాలిక పేస్ మేకర్‌ను తీవ్రమైన గుండె జబ్బుతో ఇబ్బంది పడే రోగులకు అమర్చడం ద్వారా రోగి ప్రాణాలను కాపాడతామని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద మీడియాకు తెలిపారు. డాక్టర్ సురేష్ ప్రస్తుతం విశాఖలోని మెడికవర్ ఆసుపత్రిలో ఎలక్ట్రో ఫీజియాలజిస్ట్, కార్డియాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. పరికరాలను విరాళం అందించిన డాక్టర్ సురేష్‌ను సూపరింటెండెట్ డాక్టర్ శివానంద, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఆదిలక్ష్మి, డాక్టర్ శ్రీనివాసరావు అభినందించారు.

జివిఎంసి కమిషనర్‌గా కలెక్టర్ అదనపు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎంఎన్. హరేంధిర ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జివిఎంసి కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో సంబంధిత పత్రాలపై సంతకం చేసి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.

శాంసంగ్ ఆవిష్కరణలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: శాంసంగ్ గురువారం గెలాక్సీ బడ్స్3, గెలాక్సీ బడ్స్3 ప్రోతో పాటు గెలాక్సీ జెడ్ ఫోల్డ్6, గెలాక్సీ జెడ్ ఫ్లిప్6ని విడుదల చేసిందని విశాఖపట్నంలోని శాంసంగ్ షోరూమ్‌లో మార్కెటింగ్ హెడ్ కుమార్ ఆవిష్కరించారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి

పోలీసులకు ఫిర్యాదు చేసిన డెక్కన్ క్రానికల్ యంత్రాంగం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: డెక్కన్ క్రానికల్ కార్యాలయంలోకి ప్రవేశించి ఆస్తులు ధ్వంసానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డెక్కన్ కార్యాలయ సిబ్బంది ఎంవిపి.పోలీసులకు ఫిర్యాదుచేశారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు సంబంధించి డెక్కన్ క్రానికల్ పత్రికలో వచ్చిన కథనానికి ఎంవిపి.కాలనీ, అప్పుఘర్ దగ్గర గల డెక్కన్ క్రానికల్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్‌కు చెందిన కొంతమంది వ్యక్తులు వచ్చి కార్యాలయం ప్రవేశ ద్వారం, అద్దాలు పగలగొట్టి, పేపర్ నేమ్ బోర్డును తగులబెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన మహిళా జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. డెక్కన్ క్రానికల్ రాష్ట్ర కరస్పాండెంట్ కెఎంపి.పట్నాయక్ ఫిర్యాదు మేరకు ఎంవిపి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెప్టెంబర్ 7,8,9 తేదీలలో ఎఐటియుసి జాతీయ సమావేశాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎఐటియుసి జాతీయ సమితి సమావేశాలు సెప్టెంబర్ 7, 8, 9 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె అచ్యుతరావు తెలిపారు. అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ సమావేశాలకు దేశ నలుమూలల నుంచి 500 మంది ఎఐటియుసి జాతీయ అగ్ర నాయకత్వం రానున్నారని తెలిపారు. సమావేశాల మొదటి రోజు కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ ఉంటాయని చెప్పారు. జాతీయ సమితి సమావేశాలు స్టీల్‌ప్లాంట్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపైన, ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరణ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాలపైనా, అసంఘటితరంగ కార్మికుల సమస్యలపైన చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తారన్నారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బి.వెంకటరావు, ఉపాధ్యక్షులు ఎస్‌కె రెహమాన్, కోశాధికారి కె.సత్యాంజనేయ, రాజుబాబు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె అచ్యుతరావు

భీమిలిలో సబ్ కోర్టు ఏర్పాటుకు కృషి


గంటాకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలిలో సబ్ కోర్టు ఏర్పాటుకు తన వంతుగా కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. గురువారం స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు ఎమ్మెల్యే గంటాను కలిశారు. భీమిలిలో సబ్‌కోర్టు ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ, దీనికి సంబంధించిన ఫైల్ ముఖ్యమంత్రి కార్యాలయంలో పెండింగ్‌లో ఉందని, దానిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే గంటా స్పందిస్తూ, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు. అంతకుముందు బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు న్యాయవాదులు ఎమ్మెల్యే గంటాకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంవి పార్వతీశం, కార్యదర్శి కెఎస్ఎం సుధాకర్, కోశాధికారి ఎం.సునీల్, ఎజిపి పాత్రుడు, న్యాయవాదులు గౌతమ్, వెంకటేష్ ,సుందర్‌సింగ్, భరద్వాజ్, బోని శివ, మాధవి ఉన్నారు

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి హైస్కూల్ విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లను స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ గురువారం పంపిణీ చేశారు. పాఠశాలలో వసతులు, భోజన సదుపాయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త ఘట్టమనేని బోసుబాబు, యార్లగడ్డ జీవన్, బిఆర్‌బి.నాయుడు, తాత్రాజు అప్పారావు, బలిరెడ్డి చంటి, మీసాల సత్యనారాయణ, పాండ్రంగి అప్పలరాజు, బమ్మిడి ఉమ, కోరాడ నాయుడు బాబు, కోరాడ తమ్ము నాయుడు(రాజు), సుంకర శివ, బన్నీ, తాడివాడ శివకృష్ణ, వెంకటరమణ, బంగారు నాయుడు, కొలగాని రమణ, కోరాడ శంకర్ ,ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

రవితేజను అభినందించిన జ్ఞానేశ్వరరావు

కాగా గొట్టిపల్లి వచ్చిన గంటా రవితేజను వేములవలస ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. తర్వాత పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మధురవాడ, కొమ్మాది, పిఎం పాలెం ఫీడర్లలో విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ మూడవ జోన్ డిఇఇ శ్రీనివాసరావు తెలిపారు. మధురవాడ, రేవళ్లపాలెం, చంద్రంపాలెం, ఎన్‌జివోస్ కాలనీ, వుడా కాలనీ, భగవాన్‌దాస్ కాలనీ, ఎంఎస్ఆర్ లే అవుట్, సాయి ప్రియా లేఅవుట్, భాస్కర్ నగర్, సంపత్ నగర్, ఉజ్వల హాస్పిటల్ ఏరియా, కొమ్మాది జంక్షన్, శ్రీనివాసనగర్, సాయిరాం కాలనీ, జిసిసి లేఅవుట్, టీచర్స్ లేఅవుట్, హౌసింగ్ బోర్డు కాలనీ, అమరావతి కాలనీ, సూర్యా పేపర్, డ్రైవర్స్ కాలనీ (సాయిరాం కాలనీ), వెంకట్ నగర్ ఎస్‌సి కాలనీ, మాస్టర్ స్కూల్ ఏరియా, డిఆర్‌కె టౌన్‌షిప్, అన్నంరాజు నగర్, అష్టలక్ష్మి టెంపుల్ ఏరియా, వేంకటేశ్వర స్వామి టెంపుల్ ఏరియా, ఋషి షాపింగ్‌మాల్ ఏరియా, వుడా కాలని మెయిన్‌రోడ్, శివాలయం వీధి, వుడా కాలనీ, కారుషెడ్ ఏరియా, సాంకేతిక కాలేజీ, పోస్టాఫీస్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వేపగుంట : సత్తివానిపాలెం 11కెవి ఫీడర్‌లో విద్యుత్ నిర్వహణ, మరమ్మతు పనుల దృష్ట్యా ఈనెల 12న శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. సత్తెవానిపాలెం, కోటనరవ, ఎంఐఎస్ కాలనీ, అహ్మద్ నగర్ తదితర ప్రాంతాల వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

ఆనందపురం: గిడిజాల సబ్‌స్టేషన్ , ఇండస్ట్రియల్ లైన్ మెయింటెనెన్స్ కొరకు శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు గిడిజాల, వేమగొట్టిపాలెం, ముచ్చర్ల ,మిందివానిపాలెం, దిబ్బడిపాలెం, తంగుడుబిల్లి, శొంఠ్యాం, బాకూరుపాలెం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఎఇఇ సురేష్‌కుమార్ తెలిపారు.

పారిశ్రామిక అవసరాలకు ప్రాధాన్యత

గీతంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ప్రాయోజిత బిఎస్‌సి కోర్సు ప్రారంభం


డాక్టర్ రెడ్డీస్‌ల్యాబ్ ప్రతినిధులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ వేదవతి

ప్రజాశక్తి -మధురవాడ : పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ప్రముఖ ఔషధ పరిశ్రమ డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయనిక శాస్త్ర విభాగంతో కలిసి నిర్వహిస్తున్న బిఎస్‌సి కెమిస్ట్రీ డిగ్రీ కోర్సుల తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కృష్ణ మాట్లాడుతూ, విద్యార్థుల ఎంపికతో పాటు వారి చదువుకు అయ్యే వ్యయాన్ని డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ పూర్తిగా భరించడం అభినందనీయమన్నారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా రసాయనశాస్త్రంలో పిజి కోర్సు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేదవతి మాట్లాడుతూ శాస్త్ర పరిశోధనలకు గీతం అధిక ప్రాధాన్యతనిస్తోందని, అధునాతన ప్రయోగ శాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్‌విఎస్ వేణుగోపాల్ బిఎస్‌సి కెమిస్ట్రీ కోర్సు విశేషాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ మానవ వనరుల విభాగం మేనేజర్ లక్ష్మీదుర్గ, కోఆర్డినేటర్ డాక్టర్ ఎమ్.సురేష్, డాక్టర్ అలిన్ రింకి రోబర్ట్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని వెల్లంకి పంచాయతీ గొరపేటలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ, ఆత్మ ఆధ్వర్యంలో స్కూల్ సోయిల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా 25మంది కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు భూసార పరీక్షలపై క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ భీమిలి ఎడి బొడ్డేపల్లి విజయప్రసాద్, భూసారపరీక్షలకు మట్టినమూనాల సేకరణ, పరీక్షల నివేదికల ఆధారంగా సాగుయాజమాన్య పద్ధతులపై వివరించారు. జిల్లా శిక్షణా కేంద్రం ఎడిఎ సిహెచ్. సుబ్రమణ్యం మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాల సాగు, వానపాములతో భూసారం పరిరక్షణపై వివరించారు. భూసార పరీక్ష కేంద్రం ఎడిఎ టి.దాస్ పొలాలలో మట్టి నమూనాలను సేకరించే విధానాన్ని విద్యార్థులకు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు.కార్యక్రమంలో ఎఒ సిహెచ్ సంధ్యారత్నప్రభ, సురేష్ , వెల్లంకి ఎంపిటిసి పి. అప్పలనాయుడు, వైస్ సర్పంచ్ కె. శ్రీనివాస్, స్థానిక రైతులు నరసింగరావు, రాజు, ముత్యాలరెడ్డి, అప్పలరాజు, స్థానిక గ్రామ వ్యవసాయ సహాయకులు రమేష్, వినూత్న పాల్గొన్నారు .

'బాలికలను చదివిద్దాం'పై కళాజాతా

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని వెల్లంకి గ్రామపంచాయతీలో గురువారం జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలికలను రక్షిద్దాం - బాలికలను చదివిద్దాంపై అవగాహనకు కళాజాతా ప్రదర్శన నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థినులకు బాలల హక్కులు చట్టాలు, బాల్య వివాహాలు, గుడ్ టచ్ బాడ్ టచ్ వంటివాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, ఉప సర్పంచ్ కంచరాపు శ్రీనివాసరావు, ఎంపిటిసి పడాల అప్పలనాయుడు, సచివాలయం మహిళా పోలీస్ శ్యామల, విఆర్ఒ అప్పల రెడ్డి పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని సందర్శన


పరిశీలిస్తున్న సమగ్రశిక్ష స్టేట్ కోఆర్డినేటర్ అమ్మినాయుడు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక భవిత కేంద్రాన్ని సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు ఎన్ అమ్మినాయుడు గురువారం పరిశీలించారు ప్రత్యేక అవసరాల పిల్లల సామర్థ్యాన్ని, వారి జీవన నైపుణ్యాలను అక్కడున్న సహిత విద్యా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.బోధించే పద్ధతులను పరిశీలించారు. భవిత కేంద్రంలోని రికార్డులు, రిజిస్టర్లు , బయో మెట్రిక్ హాజరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు పిల్లల అభివృద్ధికి అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఫిజియోథెరపిస్ట్ లేనందున వికలాంగ బాలలకు ఫిజియోథెరపీ జరగడం లేదని సహిత విద్యా ఉపాధ్యాయులు చెప్పగా, పోస్టు భర్తీకి చర్యలు చేపడతామన్నారు. జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ గీత, ఎంఎల్‌ఎస్ఒ శ్రీనివాసరావు, ఎంఇఒలు శివరాణి, జయప్రద పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార : ద్విచక్ర వాహనదారులు ప్రయాణంలో విధిగా హెల్మెట్‌ను ధరించాలని విశాఖపట్నం సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ అన్నారు. గురువారం సీతమ్మధార రైతుబజారులో వినియోగ దారుల అవగాహనా సదస్సులో మాట్లాడుతూ హెల్మెట్‌ధారణతో ప్రమాద సమయంలో బైకిస్ట్‌లకు ప్రాణరక్షణ ఉంటుందన్నారు. సదస్సులో జి. వల్లభనాయుడు.,రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ పాల్గొన్నారు

ఘనంగా ఆర్‌టిసి ఇయు ఆవిర్భావ దినోత్సవం


యూనియన్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రమణ

ప్రజాశక్తి -మధురవాడ : ఎపిపిటిడి (ఆర్‌టిసి) ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మధురవాడ ఆర్‌టిసి డిపో ప్రధాన గేటు వద్ద ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి, డిపో యూనియన్ గౌరవాధ్యక్షులు పడాల రమణ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. కేకు కట్‌చేసి, కార్మికులకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, 1952లో ఎఐటియుసి సారధ్యంలో ఆవిర్భవించిన ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ అనేక పోరాటాలు చేసి, ప్రైవేటుచేతిలో ఉన్న ఆర్‌టిసిని జాతీయం చేసేందుకు ఉద్యమించి చరిత్ర సృష్టించిందన్నారు.ఆర్‌టిసి కార్మికులు అనుభవిస్తున్న అనేక చట్టాల సాధనలో కీలక భూమిక పోషించిందన్నారు. ప్రభుత్వంలో విలీనం తర్వాత సర్వీసు రూల్స్ ప్రకారం ఆర్‌టిసి కార్మికులకు రావాల్సిన జీతభత్యాలపై ఇపుడు ఇయు పోరాటం చేస్తోందన్నారు.యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నందమూరి రామారావు, డిపో కార్యదర్శి కెవి.రాజు, డిపో అధ్యక్షులు డి.చిన్నారావు. జికెఎం రాజు, ఎఐటియుసి మధురవాడ జోన్ నేతలు వైఎస్.మూర్తి, పొన్నాడ సాయి, ఆర్.రాజు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రైతు ఇంట్లో చోరీ

- రెండు తులాల బంగారం, రూ.50వేలు నగదు అపహరణ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, టి నగరపాలెం పంచాయితీ, గొల్లలపాలెంలో రైతు మొల్లి పెంటయ్య ఇంట్లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది నేర విభాగం ఎస్ఐ సూర్య ప్రకాశరావు కథనం ప్రకారం, మొల్లి పెంటయ్య కుటుంబ సభ్యులు మేడపైన నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో నుంచి శబ్దం రావడంతో కిందకు దిగి వచ్చి చూసేసరికి వస్తువులన్నీ చిందరవందరగా ఉన్నాయి. బీరువా తెరిచి చూడగా, అందులోని రెండు తులాల బంగారం ఆభరణాలు, రూ.50వేలు నగదు అపహరణకు గురయ్యాయి. బాధితుని ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ చేరుకుని పరిశీలన జరిపారు.నేర విభాగం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు

లారీ ఢీకొని స్కూటరిస్ట్‌కు తీవ్రగాయాలు

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని భీమిలి క్రాస్ రోడ్ గొరపేట సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. భీమిలి మండలం దెక్కతవాని పాలేనికి చెందిన పిన్ని అప్పలరాజుస్కూటీపై మధురవాడ వెళ్లి తిరిగి వస్తుండగా భీమిలి క్రాస్ రోడ్ సమీపంలో భీమిలి నుండి ఎదురుగా వస్తున్న లారీ అదుపుతప్పి ఢీకొంది.ఈ ఘటనలో అప్పలరాజు రోడ్డుపై పడి తలకు నుదుటికి, కుడికాలుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో పోలీసులు 108 వాహనంలో విశాఖ కెజిహెచ్‌కు చికిత్స తరలించారు.అప్పలరాజు కుమారుడు ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఆనందపురం ఎస్ఐ సంతోష్ కేసు దర్యా ప్తు చేస్తున్నారు

రేషన్ డిపోల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు అప్పలనర్స కాలనీ రేషన్ డిపో 535తోపాటు పలు డిపోలను గురువారం ఇంటిలిజెన్స్ సిఐ లక్ష్మి ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సాధారణ తనిఖీల్లో భాగంగానే స్టాక్ పరిశీలించామని, అలాగే మొబైల్ వాహనాల్లో రేషన్ సరుకులను కూడా తనిఖీ చేశామన్నారు. చెకింగ్ ఆఫీసర్ నగేష్ సిబ్బంది ఉన్నారు

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి -ములగాడ: అన్నార్తులకు సేవ చేయడంలోనే ఆనందం, సంతృప్తి ఉంటాయని ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ విశ్రాంత ఉద్యోగిని నందూరి సీతాకుమారి అన్నారు. గురువారం జ్ఞానాపురంలోని మదర్ థెరిస్సా వృద్ధాశ్రమంలో వృద్ధులకు 40 దుప్పట్లు, 40 స్టీలు పాత్రలు, స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యూష, సాయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంఅధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి, వాలంటీర్లు దివ్య, గౌతమి వృద్ధాశ్రమ సిస్టర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేడియో ఆర్టిస్ట్, ఆధ్యాత్మికవేత్త వరదాచారి జయంతి నిర్వహించారు.

రెండో శనివారం సెలవు ఇవ్వాల్సిందే

ప్రజాశక్తి-సీతమ్మధార : అన్ని యాజమాన్యాలలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కాలేజీలకు ప్రతినెలా రెండో శనివారం సెలవును విధిగా అమలుపై ఆర్ఐఒ, ఇతర విద్యాశాఖాధికారులు దృష్టి పెట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. దీనిపై ఏ ఒక్కరికీ మినహాయింపులు లేవన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు రెండో శనివారం సెలవు అమలుకు ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై ఇప్పటికే వస్తున్న ఫిర్యాదులపై కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో పరిశీలన జరిపి చర్యలు చేపడతామన్నారు.సంబంధిత ఫిర్యాదులను apscpcr2018@ gmail.com మెయిల్‌కు పంపించవచ్చని సీతారాం సూచించారు.

జగన్నాథుని రథయాత్ర వేడుకలు

ప్రజాశక్తి- సీతమ్మధార: జివిఎంసి 32వ వార్డు, నేరెళ్లకోనేరు వద్ద ఉత్కళ యువ సేవ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగన్నాథుని రథయాత్ర వేడుకల్లో దక్షిణ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ పాల్గొని, స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఉత్కళ యువ సేవ సమాజ్ సభ్యులు రమేష్ పాడి, ప్రవీణ్ మహంతి, సుదర్శన్ పాడి, మాధవ్ సాహు తదితరులు సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు ఎస్‌కె. సలీమ్, నీలబాబు , సత్తిబాబు, అరుణ్, అప్పారావు, అవతార్, శ్రీను, ఖాసీం, సాజన్, శివరామ్, జగదీష్, భవాని, రమణ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి పలువురు ఎంపిక



బండారు నైమిష మంత్రి త్రిష ఎస్.మేఘన భవానీ ప్రసాద్

ప్రజాశక్తి -భీమునిపట్నం : చిట్టివలస జెడ్‌పి హైస్కూల్, ఎపి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. గురుకుల పాఠశాల కు చెందిన 11 మంది విద్యార్థినులు ట్రిపుల్ ఐటికి ఎంపికకాగా, వారిలో నలుగురు నూజివీడు, ఒకరు ఒంగోలు, శ్రీకాకుళం ఆరుగురు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ కోడి రాంబాబు తెలిపారు. ట్రిపుల్ ఐటి సాధించిన వారిలో బండారు నైమిష, మంత్రి త్రిష, పోతలఅఖిల, సబ్బవరపు మేఘన, బండారు హైందవి ఉన్నారు. అలాగే చిట్టివలస జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు గిడుతూరి భవానీ ప్రసాద్, ప్రేమ్‌కుమార్ సాహు, జి పవన్‌కుమార్, పి అనిల్‌కుమార్, బి ప్రణవి ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారని హెచ్ఎం పొట్నూరు మురళీ మోహనరావు తెలిపారు

'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్‌తో సులభంగా విద్యుత్ బిల్లుల చెల్లింపులు

ప్రజాశక్తి- సీతమ్మధార: ఇటీవల సరికొత్త ఫీచర్లతో ఎపిఇపిడిసిఎల్ ప్రారంభించిన 'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులను సులభంగా చెల్లించవచ్చని సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం తెలిపారు. ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్ ను వినియోగిస్తున్న వినియోగదారుల సంఖ్య కేవలం వారం రోజుల్లోనే లక్ష నుంచి 5.07 లక్షలకు పెరిగిందన్నారు. రోజువారీ లావాదేవీలు ఐదు వేలు నుంచి 70వేలకు పెరిగాయన్నారు. మొబైల్ యాప్ ద్వారా గత నెల మొదటి 10 రోజుల్లో రూ.3 కోట్లు విద్యుత్ బిల్లులు వసూలు కాగా, ఈ నెల 10 తేదీ వరకు యాప్ ద్వారా రూ.50 కోట్లు బిల్లులు చెల్లించారన్నారు. ఆన్‌లైన్ విద్యుత్ బిల్లుల చెల్లింపులకు నేరుగా థర్డ్‌పార్టీ యాప్‌లను వినియోగించే అవకాశం లేకపోయినప్పటికీ, 'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్ ద్వారా ఫోన్‌పే, జీ పే, పేటిఎం, ఇతర యాప్స్‌తో పాటు నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్, వాలెట్స్, క్యాష్ కార్డ్స్ ద్వారా వినియోగదారులు బిల్లులు చెల్లిస్తున్నారన్నారు. విద్యుత్ సమస్యలను ఫిర్యాదు చేయడం, బిల్లు వివరాలు, బిల్లు లెక్కింపు వంటి మరెన్నో ఫీచర్లు ఈ యాప్‌లో ఉన్నాయన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా, https://play.google.com/ store/apps/ details?idRcom.apepdcl.easternpower&hlRen లింకు ద్వారా ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి సురక్షితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులను సురక్షితంగా, సులభతరంగా చెల్లించవచ్చని సూచించారు.

అవంతి విద్యాసంస్థలకు స్వయం ప్రతిపత్తి



కేక్ కట్ చేస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -తగరపువలస: నర్సీపట్నం, తగరపువలస, మాకవరపాలెంలో ఉన్న అవంతి విద్యాసంస్థలకు యుజిసి స్వయం ప్రతిపత్తి కళాశాలలుగా గుర్తింపు వచ్చిందని అవంతి విద్యా సంస్థల అధినేత, మాజీ మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాసరావు అన్నారు.అవంతి విద్యాసంస్థలను అటానమస్‌గా గుర్తించడంపై హర్షం వ్యక్తం చేశారు. స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం విద్యా సంస్థల వైస్ చైర్మన్ శివనదేశ్, ప్రిన్సిపల్స్, డైరెక్టర్లు వివిధ విభాగాల అధ్యాపకులతో కలిసి కేకు కటచేసి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ, తమ విద్యాసంస్థలకు ఇప్పటికే నాక్ అక్రిడిటేషన్ నుంచి ఏ ప్లస్ గుర్తింపు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ డాక్టర్ సి మోహనరావు, డాక్టర్ మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, అధ్యాపకులు, సిబ్బందిని ముత్తంశెట్టి అభినందించారు

ఎస్‌బిసి వంతెనపై వాహన రాకపోకలకు అనుమతించాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా



ధర్నాలో పాల్గొన్న జగ్గు నాయుడు, ఇతర నేతలు

ప్రజాశక్తి -ములగాడ: ఎస్‌బిసి బ్రిడ్జిపై వాహన రాకపోకలకు అనుమతించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు డిమాండ్ చేశారు. గురువారం మల్కాపురం బస్‌స్టాప్‌లో సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గు నాయుడు మాట్లాడుతూ, డాక్‌యార్డు సర్దార్ వల్లభాయిపటేల్ వంతెన పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేశారు. అలా పనులు చేసినా అది పూర్తయ్యేసరికి కనీసం ఏడాదైనా పడుతుందన్నారు. అంతవరకు ఎస్‌బిసి బ్రిడ్జిపై వాహన రాకపోకలకు నేవల్ అధికారులు అనుమతించాలని కోరారు. ఇపుడు ఆర్‌టిసి బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించిన మార్గంలో మూడు రైల్వేట్రాక్‌కు ఉన్నాయని, ఒకవేళ రైల్వేగేటు పడితే గంటలతరబడి వాహనాలు నిలిచిపోక తప్పని పరిస్థితి ఉందన్నారు. ఇదే మార్గంలో కెజిహెచ్, ఇతర ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లేరోగులు, రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు, నిత్యం వందలమంది ఉద్యోగులు, విద్యార్థులు, కాంట్రాక్టు, రెగ్యులర్ కార్మికులు ఈ మార్గంలోనే పయనిస్తున్నారని, దీంతో వారంతా నిత్యం ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని, నేవల్ అధికారులతో సంప్రదింపులు జరిపి, డాక్‌యార్డు వంతెన పూర్తయ్యేవరకు ఎస్‌బిసి బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతించేలా చర్యలు చేపట్టాలని కోరారు. సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు మాట్లాడుతూ, అన్నివర్గాల ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, గాజువాక పారిశ్రామిక ప్రాంతం వైపునుంచి నగరానికి వెళ్లాలంటే దగ్గర మార్గమైన ఈ రూటులో రాకపోకలకు అనుమతించేలా చర్యలు చేపట్టాలని కోరారు. సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు కె.పెంటారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో జోన్ నేతలు ఆర్.లక్ష్మణమూర్తి, ఎల్.కృష్ణ, పి.రామారావు, కె.నూకరాజు, ఆర్.దేవరాజు, అర్జునరావు, అచ్యుతరావు పి.సురేష్, నరేష్, ఎస్.వాసు, రాజేష్, రాజు, నీలయ్య ఎం.కృష్ణారావు పాల్గొన్నారు.

తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు పంపిణీ

● రైతుబజారులో ప్రభుత్వ స్టాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గంటా



కందిపప్పు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -మధురవాడ: బియ్యం, కందిపప్పు, ఇతర నిత్యవసరాల ధరలు పెరిగిపోతున్న నేపథ్యంలో సామాన్య ప్రజలకు తక్కువ ధరకే వీటిని అందించేందుకు రైతుబజార్లలో ప్రభుత్వం ప్రత్యేకస్టాళ్లను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం మధురవాడ రైతుబజారులో ప్రభుత్వ స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వినియోగదారులకు కిలో కందిపప్పు, ఐదు కిలోల బియ్యాన్ని తక్కువ ధరకే ఈ స్టాల్‌లో పొందవచ్చన్నారు. ఇతర సరుకులను విక్రయిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతుబజారును కలియతిరిగి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రవేశద్వారం ఇరుకుగా ఉండడం, అక్కడ వేరే వర్తకులు దుకాణాల ఏర్పాటు, పార్కింగ్ ఫీజు వసూలు, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యం ఇతర సమస్యలను ఎమ్మెల్యే గంటా దృష్టికి రాగా, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో కోరాడ రాజబాబు, టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు ,పిల్లా వెంకటరావు, వాండ్రాసి అప్పలరాజు,శాకర శ్రీనుబాబు, టిడిపి వార్డు అధ్యక్షులు నాగోతి వెంకట సత్యనారాయణ, దాసరి శ్రీనివాస్, శెట్టిపల్లి గోపి, బోయి వెంకటరమణ, నమ్మి శ్రీనివాసరావు, బోయి రమాదేవి, జనసేన అధ్యక్షులు దేవర శివ, నాగోతి నరసింహానాయుడు, పిల్లా శ్రీను, మామిడి దుర్గారావు, పిల్లా కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

ప్రజాశక్తి -మాధవధార : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ విశాఖ జిల్లా కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అసోసియేషన్ అధ్యక్షులుగా డి రాజశేఖరరెడ్డి, కార్యదర్శిగా డివిఎస్ఎన్ రాజు, కోశాధికారిగా సిహెచ్ హరిగోపాల్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.వి.సత్యం, అసోసియేట్ అధ్యక్షులుగా యు జీవన్‌సంతోష్, ఉపాధ్యక్షులుగా కె.వెంకటరావు, సభ్యులుగా ఎం అమర్నాథ్, బి సుచరిత నితాలు, సి గణేష్, మారుతీరావు, ఐ గోపికృష్ణ, సంయుక్త కార్యదర్శిగా పి వెంకటేష్, బి. ప్రసాద్, ఎస్ దిలీప్‌కుమార్, కె రోహిణికుమార్, ఎస్ భానురేఖ, బి సతీష్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

తర్లువాడ కొండపై రహస్య సర్వే?

స్థానికుల్లో మళ్లీ గుబులు
ఏం జరుగుతుందోనని సర్వత్రా చర్చ



తర్లువాడ కొండ

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని తర్లువాడ కొండపై అధికారులు వారం రోజులుగా రహస్య సర్వే చేస్తున్నారన్న సమాచారంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో వైసిపి ముఖ్యనేత విజయసాయిరెడ్డి తన కుమార్తె పేరిట విద్యాసంస్థ నెలకొల్పేందుకు అప్పట్లో ప్రయత్నాలు చేసి, సర్వేలు చేయించారని,, అయితే వైసిపి ఓటమి తర్వాత ఇన్నాళ్లుగా అటువైపు ఎవరూ చూడకపోవడంతో స్థానికులు స్థిమితంగా ఉన్నారు. ఇపుడు గ్రామ, మండల రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారన్న సమాచారంతో మళ్లీ అలజడి మొదలైంది. తర్లువాడ కొండపై కొంతభాగం గుడికి, ఇంకా మరో 150ఎకరాలు పర్యాటకాభివృద్ధికి పుడకు ఇచ్చే ప్రతిపాదనలు ఉన్న నేపథ్యంలో ఇపుడు ఈ సర్వే ఏంటని స్థానికంగా చర్చనీయాంశమైంది.

రైతుబజారును వినియోగంలోకి తెస్తా



రైతుబజారును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు తోటగరువులో అసంపూర్తిగా ఉన్న రైతుబజారును ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం పరిశీలించారు. వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, మార్కెటింగ్ శాఖ జెడి సుధాకర్, ఇఇ రవిప్రసాద్‌లతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే వెలగపూడి, పనులు నిలిచిపోవడానికి కారణాలపై ప్రశ్నించారు. ఇప్పటివరకు 70శాతం వరకు పనులు పూర్తికాగా, రూ.47లక్షల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉందని, బిల్లులు అందకే కాంట్రాక్టర్ పనులు నిలుపుదల చేశారని అధికారులు విన్నవించారు. ఎమ్మెల్యే వెలగపూడి స్పందిస్తూ, ఉన్నతస్థాయి అధికారులతో మాట్లాడి రైతుబజార్‌ను పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపడతానన్నారు. మత్స్యకారులకు చేపలు అమ్ముకునేందుకు ప్రత్యేకంగా బజార్‌ను ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. రైతుబజార్‌కు మరింత స్థలం కేటాయింపునకు సంబంధిత మంత్రి అచ్చెంనాయుడు దృష్టికి తీసుకు వెళ్తానని తెలిపారు. బిఎస్ఆర్ నగర్ నుంచి రైతుబజార్‌కు రహదారి ఏర్పాటుపై స్థానిక టిడిపి నాయకులు అభ్యర్థనను పరిశీలిస్తామన్నారు. టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, మద్దిల కాశీశేఖర్, గాదు అప్పలనాయుడు, ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ఒమ్మి పోలారావు పాల్గొన్నారు.

ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షలు



మహిళలకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న వైద్యనిపుణులు

ప్రజాశక్తి- గాజువాక: షీలానగర్ అప్ కీప్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో షీలానగర్ కమ్యూనిటీ సెంటర్‌లో గురువారం ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వారం, ఇతరత్రా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.సుభద్ర, డాక్టర్ సుధానంద్ మాట్లాడుతూ, కేన్సర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ అర్జున్, నాయుడు, లతా రాజేశ్వరి, అసోసియేషన్ సెక్రటరీ వై.సత్యవతి, పిఎస్ఎన్ రాజు, సత్యారావు, సుబ్బరాజు, శ్రీనివాస్, జానకి పాల్గొన్నారు. ఈ మెడికల్ క్యాంపుకు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

చీరాల ఎమ్మెల్యేకు ఘన స్వాగతం



ఎమ్మెల్యే కొండయ్యను స్వాగతిస్తున్న ఆర్‌కె టౌన్‌షిప్ సిబ్బంది

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ నగరానికి వచ్చిన చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్యకు ఘనస్వాగతం లభించింది. గురువారం విమానాశ్రయంలో ఆర్‌కె టౌన్‌షిప్ గ్రూపు సిబ్బంది ఆయనను ఘనంగా స్వాగతించి, ఎయిర్‌పోర్టు నుంచి గాజువాక వరకు ర్యాలీగా తీసుకొచ్చారు. గాజువాక ఆర్‌కె టౌన్‌షిప్‌లో మేనేజర్లు, మార్కెటింగ్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలిపారు తర్వాత పంచవటి వెళ్లిపోయారు.

చంద్రబాబు ప్రభుత్వంలోనూ ఆగని నిర్బంధాలు

తీవ్రంగా ఖండించిన సిపిఎం, సిఐటియు నేతలు



ధర్మవరంలో సిపిఎం నేత అప్పలరాజు వద్ద పోలీసులు



చోడవరంలో సిఐటియు నేత వరలక్ష్మి నిర్బంధించిన దృశ్యం



అచ్యుతాపురంలో రామును హౌస్ అరెస్టు చేసిన దృశ్యం

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

రాష్ట్రంలో పాలక పార్టీ, పాలకులు మారినా... ప్రజల తరుపున నిలబడే వారి పట్ల వారి వ్యవహార శైలి మారలేదు. వైసిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎక్కడ పర్యటించినా ప్రజల పక్షాన నిరంతరం పోరాడే సిపిఎం, సిఐటియు, ఇతర ప్రజా సంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగానే గృహ నిర్బంధం చేసేవారు. ఇటీవల అధికారం చేపట్టిన చంద్రబాబునాయుడు ప్రభుత్వం కూడా అదే వరవడిని కొనసాగిస్తోంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నెల రోజుల్లోనే గురువారం చంద్రబాబు అనకాపల్లి జిల్లా పర్యటన సందర్భంగా సిపిఎం, సిఐటియు నాయకులను జిల్లాలోనే కాకుండా అల్లూరి జిల్లా పాడేరులోనూ పోలీసులు గృహ నిర్బంధం చేశారు.

అచ్యుతాపురం : ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటన నేపథ్యంలో గురువారం ఉదయాన్నే సిపిఎం అచ్యుతాపురం డివిజన్ కన్వీనర్ ఆర్ రామును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. పోలీసుల వైఖరిని రాము తీవ్రంగా ఖండించారు.

చోడవరం రూరల్ : జిల్లాలోని చోడవరంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మిని పోలీసులు గురువారం గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలు సమస్యలను విన్నవించుకొనే స్వేచ్ఛ కూడా లేకుండా పాలకులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వ ఇలాగే నిర్బంధాలు విధించడంతో ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత వచ్చిందని, చంద్రబాబు ప్రభుత్వం దానిని గుణపాఠంగా తీసుకొని నిర్బంధాలను ఆపాలని డిమాండ్ చేశారు.

ఎస్.రాయవరం : చంద్రబాబు మండలంలోని దార్లపూడి పోలవరం ఎడమ కాలువ సందర్శన నేపథ్యంలో ధర్మవరం అగ్రహారం గ్రామంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజును పోలీస్‌లు గురువారం ఉదయం గృహ నిర్బంధం చేశారు. సిఎం పర్యటన ముగించుకుని వెళ్లిన అనంతరం పోలీస్ సిబ్బంది ఇంటి నుండి వెళ్లారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, అన్ని విధాలుగా వెనుకబడి ఉన్న పాయకరావుపేట నియోజకవర్గం అభివృద్ధి కోసం పోరాటం కొనసాగిస్తామన్నారు. ఎన్ని సార్లు ఎంతటి నిర్బంధం చేసినా ఈ నియోజకవర్గం ప్రజల కోసం పోరాడతామని తెలిపారు.

ఆదివాసీ గిరిజన సంఘం నేతల గృహ నిర్బంధం

పాడేరు : ముఖ్యమంత్రి అనకాపల్లి, విశాఖపట్నం పర్యటన సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనరస, జిల్లా నాయకులు వంతల దాస్‌ను గృహ నిర్బంధించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తిరిగి వెళ్లే వరకూ పాడేరులో నివాసంలోనే పి.అప్పలనరస, దాస్‌లను పోలీసులు గృహ నిర్బంధించారు. పోలీసులు మఫ్టీలో వచ్చి గురువారం ఉదయం నుండి ఇంటి నుంచి కదలనివ్వకుండా ఉంచారు.

సిఐటియు ఖండన

మునగపాక : సిపిఎం, సిఐటియు నాయకుల అక్రమ గృహ నిర్బంధాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో అచ్యుతాపురంలో సిపిఎం నేత ఆర్.రామును పోలీసులు గృహనిర్బంధం చేయడం దారుణమన్నారు. గత ముఖ్యమంత్రి జగన్ బాటలోనే చంద్రబాబు పయనిస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని గనిశెట్టి హెచ్చరించారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనరీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి- అనకాపల్లి

ఈనెల 27 28 తేదీల్లో జరిగే ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో గురువారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు గీత కృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ప్లీనరీ పోస్టర్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. నీట్ ప్రశ్నాపత్రం అవకతవకలపై వివిధ రూపాల్లో అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు విద్యార్థులు పోరాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యని ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందని, యూనివర్సిటీలకు నిధులు తగ్గించేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ లేదని, వేలాది మంది గ్రామీణ యువత ప్రైవేట్ కాలేజీ వైపు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని అనకాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్లీనరీ సమావేశాలు భవిష్యత్తు విద్యార్థుల సమస్యలపై పోరాటాలకు దిక్సూచిగా ఉంటాయని చెప్పారు. ఆయన అన్నారు. ఈ ప్లీనరీ సమావేశాలకు జిల్లా నలుమూలల నుండి విద్యార్థులు హాజరవుతారని ప్లీనరీని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి. గీతాకృష్ణ ఎం.రమణ, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.రమణ, కే. ఆదికేశవ, అభిషేక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియా బాధితునికి సిఐటియు నేత పరామర్శ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని దిబ్బపాలెం పంచాయితీ మోటూరుపాలెం గ్రామానికి చెందిన 11 నెలల బాలుడు కోడూరు జనార్దన్ డయేరియా వ్యాధి లక్షణాలతో విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతుండగా, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము గురువారం జనార్దన్‌ను పరామర్శించారు. బాలుడికి అందుతున్న వైద్య సేవలు గురించి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

రూ.12 లక్షల విలువైన ఆభరణాలు రికవరీ

ప్రజాశక్తి - యలమంచిలి : రైలు ప్రయాణాల్లో చోరీకి గురైన రూ.12 లక్షల విలువైన ఆభరణాలను రికవరీ చేసినట్లు రాజమండ్రి రైల్వే డిఎస్పీ ఎల్ మోహనరావు గురువారం తెలిపారు. ఈ మేరకు రికవరీ చేసిన ఆభరణాలు ప్రదర్శించి కేసు వివరాలు ఆయన వెల్లడించారు. యలమంచిలి, నర్సీపట్నం రోడ్, తుని రైల్వే స్టేషన్ల పరిసరాల్లో రైలు ప్రయాణికుల వద్ద దొంగిలించబడగా, రైళ్లలో అమర్చిన సిసి కెమేరాల ద్వారా నేరస్తులను గుర్తించినట్లు తెలిపారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం, రాచపల్లి గ్రామానికి చెందిన సేనాపతుల మనిష్ (23)ను అరెస్టు చేశామన్నారు. అతని వద్దనుండి రూ.12 లక్షల విలువైన 190 గ్రాముల బంగారం, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నేరస్తుల్ని పట్టుకొనడంలో ప్రతిభ చూపిన తుని రైల్వే ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మూరూఫ్‌ను అభినందించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పితాని శ్రీనివాసరావు, కానిస్టేబుల్స్ రామకోటి, శివ, సురేష్, ప్రసాదరావు సతీశ్, రవికుమార్ పాల్గొన్నారు.



రికవరీ చేసిన ఆభరణాలు చూపుతున్న పోలీసులు

నేడు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలోని సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బిసి సంక్షేమ శాఖ వసతి గృహాల బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, వసతి గృహాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, విద్యార్థులకు ఇవ్వవలసిన పాఠ్యపుస్తకాలను వెంటనే అందజేయాలని కోరుతూ శుక్రవారం సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ ఆధ్వర్యంలో అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం జరుగుతుందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ కార్యక్రమంలో ఆయా పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని తానాం గ్రామంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పనులను దుంగల వాని చెరువులో గురువారం సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వర్రి మంగలక్ష్మి వసంతరావు, వార్డు సభ్యులు పైల లలిత దేముడుబాబు, చీపురుపల్లి కృష్ణవేణి, గొరపుటి సన్యాసినాయుడు, గొరపుటి సన్యాసిరావు, రొంగల లక్ష్మీదేవి అప్పారావు, రొంగల రమ్య సన్యాసిరావు, గొరపుటి సతీష్, వర్రి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి మహేష్, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఇంచార్జి ఏపీవో బాలసుబ్రహ్మణ్యం, టిపి కన్నం నాయుడు, కన్నూరు యువసేన సభ్యులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ దేవి

అస్వస్థతకు గురైన పాఠశాల విద్యార్థులు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ప్రజాశక్తి వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాది జెడ్‌పి హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థినులు గురువారం అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో పదో తరగతి ఒకే సెక్షన్‌లో చదువుతున్న బి.అశ్వని, వి.వేదదివ్య, లోహితా లక్ష్మి, బి.సుస్మిత, వి.భార్గవి, కె.సునీత గురువారం మధ్యాహ్నం సైన్స్ క్లాస్ అయిన తరువాత భోజనానికి వెళ్ళారు. భోజనం పెట్టుకున్న నలుగురు, లైన్‌లో నిల్చున్న ఇద్దరు అమ్మాయిలు కల్లు తిరిగి స్పృహ తప్పి పడిపోయారు. ఇది గమనించిన తోటి విద్యార్థులు ఉపాధ్యాయులకు తెలియజేయగా, వారు వెంటనే ప్రభుత్వ హాస్పటల్‌కి తరలించారు. ఎంఈఓ బి కాశీవిశ్వేశ్వరరావు, హెచ్ఎం పివి శేషుబాబు ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై విద్యాశాఖ అధికారిని వివరణ కోరగా, ఎండ తీవ్రత వలన స్పృహ తప్పి పడిపోయారని, ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని తెలిపారు.

సమగ్ర విచారణ చేసి వివరాలు బహిర్గతం చేయాలి : సిపిఎం

బుచ్చయ్యపేట : వడ్డాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయంలో అధికారులు విచారణ చేపట్టి వివరాలను బహిర్గతం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సోమిరెడ్డి నాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఒకేసారి ఆరుగురు విద్యార్థులు అనారోగ్యానికి గురి కావడం విస్మయంగా ఉందని, విద్యాశాఖ అధికారులు స్పందించి విచారణ చేయాలని కోరారు.

వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

ప్రజాశక్తి-దేవరాపల్లి : వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే ధ్వంసం చేయాలని రైతులకు పిలుపునిచ్చారని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. నేడు టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా గత ప్రభుత్వ నిర్ణయాన్నే అమలు చేయడమంటే రైతులను మోసం చేయడమే అవుతుందని పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోకపోతే అనతి కాలంలోనే ప్రజల్లో వ్యతిరేకత తప్పదని వెంకన్న హెచ్చరించారు.


అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

అంకిత భావంతో పని చేయాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : గ్రామాల్లో పనిచేస్తున్న సచివాలయ ఆరోగ్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ఎంపిడీవో బిఎస్‌కెవిఎన్ పట్నాయక్ అన్నారు. మండలంలోని దాలివలస గ్రామంలో గ్రామ సచివాలయం, ఆరోగ్య కేంద్రం, అంగన్వాడి ప్రాథమిక పాఠశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రతిరోజు మంచినీటి ట్యాంకులను పరిశీలించి క్లోరినేషన్ చేయాలన్నారు. ఇంజినీరింగ్ సహాయకులు ఎప్పటికప్పుడు క్లోరిన్ టెస్ట్‌లు నిర్వహించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో స్టాక్, చిన్నారుల అటెండెన్స్‌ను తనిఖీ చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని తాళ్లపాలెం సెక్షన్ పరిధి నరసింగబిల్లి, కన్నూరుపాలెం సబ్ స్టేషన్ల పరిధిలో లైన్ వర్క్, సబ్ స్టేషన్ మెయింటినెన్స్ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు సబ్ స్టేషన్ల పరిధిలోని నర్సింగబిల్లి, ఎన్‌జి.పాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, కొత్తపల్లి, ఎఎస్.పేట, సోమవరం, కన్నూరుపాలెం, తీడ, చరకం, సుందరయ్యపేట, జి.భీమవరం, అచ్చెర్ల, మోస్పేట, ఏనుగుతుని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు దీనికి సహకరించాలని కోరారు.

ఆరోగ్య సేవలపై విచారణ

ప్రజాశక్తి-కె.కోటపాడు : జిల్లా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విచారణ బృందం మండలంలోని ఆర్లె గ్రామంలో వైద్య సేవలపై విచారణ చేపట్టారు. డాక్టర్ యూసీ కార్తిలియా ఆధ్వర్యంలో వైద్య బృందం గ్రామంలో ఉన్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రక్తహీనత పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారా? లేదా? అని పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. డెంగ్యూ, మలేరియా జ్వరాల అదుపునకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బృంద సభ్యులు డిపిహెచ్ఎన్ఓ డి.నాగమణి, గణాంకాధికారి జనార్ధన్, దినేష్ చౌడువాడ పిహెచ్‌సి సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సర్వర్ డౌన్‌తో నిలిచిన రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి- సబ్బవరం : స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం సర్వర్ డౌన్ కారణంగా రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. దీనితో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఉదయం ఒక రిజిస్ట్రేషన్ కాగా, మధ్యాహ్నం ఒకటి కూడా కాలేదు. సర్వర్ డౌన్ కావడం పట్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ప్రజలు గంటలు తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చిందని, సర్వర్ డౌన్ సమస్యను వెంటనే అధికారులు పరిష్కరించాలని ప్రజలు కోరారు.

ఘనంగా దుర్గాలమ్మ పండగ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి పండగ గురువారం ఆ గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. 5 సంవత్సరాలకు ఒకసారి జరుగుతున్న ఈ పండుగకు గ్రామస్తులు ఉదయం నుంచి అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నము పలు సాంస్కృతి కార్యక్రమాలు, మహిళల చిడతలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, తనకల పట్టాలు, సుందరపు గంగాధర్, పెంటకోట గణేష్, కుంచ నాగేశ్వరరావు, గ్రామ ప్రజలు, పెద్దలు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో రాజుకోడూరు గ్రామంలో గురువారం డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు చేతుల మీదుగా పాడి రైతులకు బోనస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హెరిటేజ్ డైరీ పాడి రైతులకు పశువులకు చేపడుతున్న పలు సంక్షేమ పథకాలను వివరించారు. పాల సేకరణకు అధిక ధర రైతులకు చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు ఎం గోపి నాయుడు, బి సత్తిబాబు, జి గోవిందు, బి భాస్కరరావు పాల్గొన్నారు.

ఖాతాలు లేని వారికి డ్వాక్రా రుణాలు ఎలా ఇచ్చారు

రౌండుటేబుల్ సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మి

ప్రజాశక్తి-అనకాపల్లి

అసలు ఖాతాలే లేని వారికి డ్వాక్రా రుణాలు బ్యాంకులు ఎలా ఇచ్చాయని ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి వరలక్ష్మి ప్రశ్నించారు. అనకాపల్లి సిఐటియు ఆఫీసులో గురువారం ఐద్వా ఆధ్వర్యంలో డ్వాక్రా సమస్యల మీద రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సత్యనారాయణపురం గ్రామంలో డ్వాక్రా సంఘాలకి సంబంధిత సిఏ మంగతాయారు ఫేక్ గ్రూపుల క్రియేట్ చేసి గ్రూప్ సభ్యుల చేత పది లక్షల నుండి 15 లక్షల రూపాయల వరకు డ్వాక్రా రుణాలు అక్రమంగా మంజూరు చేసినట్లు చెప్పారు. అసలు ఎకౌంటు లేని వ్యక్తికి బ్యాంకు రుణాలు మంజూరు చేసి బినామీ గ్రూప్ పేర్లతో శ్రీనిధి, ముద్ర వంటి లోన్లు పెట్టి వాళ్ళ ప్రమేయం లేకుండా డబ్బులు కాజేసినట్లు తెలిపారు. ఈ సమస్యపై వెలుగు అధికారులకి, పోలీస్ అధికారులకి, జిల్లా కలెక్టర్కి వినతి పత్రాలు ద్వారా తెలియజేయడం జరిగిందన్నారు. అయినా ఇప్పటి వరకూ సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి దోషులను అరెస్టు చేసి శిక్షించాలని కోరారు. ఒక వ్యక్తి బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా. యూనియన్ బ్యాంక్ ఇలా పలు రకాల బ్యాంకుల్లో డ్వాక్రా మహిళల ప్రమేయం లేకుండా అకౌంట్లు తెరిపించి వాళ్ళ పేర్ల మీద లోన్ తీసుకొని బ్యాంకుకు చెల్లించకుండా చెల్లించలేదని, ఇలాంటి వారికి లోన్లు ఇచ్చిన బ్యాంక్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఆర్.లక్ష్మి, యు.నాగమణి, యు.లోవ, ఎన్.రాణి, దుర్గ, రేవతి, సూరకత్నం, నాగమణి, నిర్మల, ధనలక్ష్మి, నాగరత్నం, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మి

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ పరిధి రామ్మూర్తినగర్‌లో రూ.7లక్షల 15 ఆర్థిక సంఘం నిధులతో నిర్మిస్తున్న సిమెంట్ రహదారి మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారితో కలిసి స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుర ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. అనంతరం కోర్లపేట వెంకటేశ్వరా ట్రేడింగ్ బండియ్య శెట్టి షాపులోను, కోమటిపేట ఫాతిమా స్టోర్స్‌లోను తక్కువ ధరలకే నిత్యావసర సరుకులు పేదలకు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రభాకరరావు, డిఇఇ వీరయ్య, టిపిఒ శ్రీలక్ష్మి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొఠారు సాంబ, బొద్దపు శ్రీనివాసరావు, కొఠారు నరేశ్, భీశెట్టి శివ, ఆడారి రమణబాబు, ఆదిమూర్తి, రమేష్‌నాయుడు, సూరకాసుల రమణబాబు, మున్సిపల్ వైస్ చెర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, గుప్తా, కౌన్సిలర్ ఈరిగిన గణేశ్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేసేవారికి సహకారం

ప్రజాశక్తి-దేవరాపల్లి : తమ గ్రామాభివృద్ధికి స్వచ్ఛందంగా పాటుపడే వారెవరైనా తమ వంతు సహకారం అందిస్తామని ఎం.అలమండ గ్రామ ఉప సర్పంచ్ సిరపురపు గంగాధర్ పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యలు పరిష్కారంతో పాటు అపరిష్కృతంగా ఉన్న సామాజిక సమస్యలు తీర్చడానికి గ్రామస్తులంతా ఏకం కావాలని కోరారు. ఈ మేరకు మాజీ సర్పంచ్‌లు పోతల లక్ష్మి శంకర్, కిర అచ్చియ్యమ్మ, వార్డు సభ్యురాలు సూర్యకుమారి, పాల సంఘం-2 అధ్యక్షుడు పొలిపిరెడ్డి రమణతో కలిసి గురువారం గంగాధర్ విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా గత పదేళ్ళ నుంచి గ్రామస్థుల సహకారంతో గ్రామాభివృద్ధికి పాటుపడ్డామని, అదే రీతి తమ గ్రామానికి చెందిన పారిశ్రామిక వేత్త ఇటీవల శ్మశానవాటికను తన సొంత ఖర్చుతో బాగుచేయించారని తెలిపారు. తమ గ్రామంలో ఆర్ అండ్ బి రోడ్డు విస్తరణ ప్రధాన సమస్యగా మారిందని, ఆ సమస్యను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కించాలని కోరారు.

ఘనంగా కన్నబాబురాజు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-మునగపాక

ఎలమంచిలి మాజీ శాసనసభ్యులు యువి.రమణమూర్తి రాజు (కన్నబాబురాజు) 74వ జన్మదిన వేడుకలు స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి మల్ల జయలక్ష్మి, జడ్పిటిసి పెంటకోట సోమ సత్యనారాయణ, వైసిపి నాయకులు ఆడారి గణపతి అచ్చియ్య నాయుడ, పొలిమేర పూర్ణచంద్ర గణేశ్వరరావు, కోనపల్లి రామ్మోహన్‌రావు, కాండ్రేగుల జగన్, సర్పంచులు సుందరపు తాతాజీ, అయినంపూడి విజయభాస్కర్‌రాజు, ఎంపిటిసిలు సూరిశెట్టి రాము, బోజా శ్రీనివాసరావు, మల్ల కాశి సురేష్, బొడ్డేడ లక్ష్మీనారాయణ, బోడకుర్తి గణేష్, బొడ్డేడ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఎలమంచిలి మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు 74వ జన్మదిన సందర్భంగా అచ్చుతాపురం వైయస్సార్ పార్టీ కార్యాలయంలో గురువారం మండల పార్టీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు, జడ్పిటిసి సభ్యుడు లాలం రాంబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కోన బుజ్జి, పి వాసు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన రాజు

ప్రజాశక్తి- సబ్బవరం

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడుని అనకాపల్లి జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పిబివిఎస్ఎన్.రాజు మర్యాద పూర్వకంగా విశాఖపట్నం అతిథి గృహంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన రామ్మోహన్ నాయుడుకు పూల గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాజు వెంట టీడీపీ మండల కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు ఉన్నారు.


పుష్పగుచ్ఛం అందించిన తెలుగు యువత నేత రాజు

గంజాయి కేసులో ముద్దాయికి జైలు

ప్రజాశక్తి -చోడవరం : గంజాయి కేసులో పట్టుబడ్డ తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన ఆర్ ముకుంద హన్‌కు విచారణ అనంతరం చోడవరం 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి కే రత్నకుమార్ రెండు సంవత్సరాల ఏడు నెలల కఠిన కారాగార శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధించారు. 2021లో నిందితుడు వి.మాడుగుల మండలం డి.సురవరం వద్ద ఐదు కేజీలు గంజాయితో మాడుగుల పోలీసులకు పట్టుపడ్డారు. విచారణ అనంతరం శిక్షను ఖరారు చేసినట్లు కె.కోటపాడు సిఐ కె.స్వామి నాయుడుతెలిపారు. పోలీసులు తరపున అడిషనల్ పీపీ యు వెంకట్రావు వాదించారు.

తోటాడలో గ్రామసభ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని తోటాడ సచివాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి అధ్యక్షతన జరిగిన ఈ సభకు రెండు గ్రామాల కూటమి నేతలు, ప్రజలు హాజరయ్యారు. తోటాడ, గవర్ల అనకాపల్లి గ్రామాల్లో ఇప్పటిదాకా చేపట్టిన, భవిష్యత్‌లో చేపట్టబోయిన పనులు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. రాజకీయాలకు అతీతంగా పంచాయతీని అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దడం కోసం అంతా కలిసి పని చేస్తామని సర్పంచ్ తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం నిర్వహణపై దృష్టి పెట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిటిసి కాండ్రేగుల వెంకటలక్ష్మి, గ్రామ పెద్దలు దొడ్డి కోటేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ కాండ్రేగుల లక్ష్మీ నారాయణ, ఉప సర్పంచ్ కోట్ల హేమ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా హర శ్రీనివాసరావు

ప్రజాశక్తి -అనకాపల్లి : లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా మాజీ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిళ్లా హర శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆయనకు పలు ప్రజా సంఘాల ప్రతినిధులు, కూటమి నాయకులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా హర శ్రీనివాసరావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు.

వాకపల్లికి బస్సు సౌకర్యంపై హర్షం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వాకపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయడం పట్ల తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తికి టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, వాకపల్లి గ్రామస్తులు ఇటీవల వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు వారం రోజుల్లో బస్సు సౌకర్యం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొగ్గ రమేష్, ఎంపిటిసి జి.భాస్కరరావు, మాజీ ఎంపిటిసి పెనుగంటి సింహాచలం నాయుడు, వి.నరసింహనాయుడు, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షుడు వై.పాత్రుడు, బి.అప్పారావు, జనసేన నాయకులు గుమ్మిడి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

69వ సారి చందు రక్తదానం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : సినీ నటుడు చిరంజీవి అభిమాని, జనసేన పార్టీ నాయకుడు లాలం చందు 69వ సారి స్వచ్ఛందంగా గురువారం చిరంజీవి బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. అచ్యుతాపురం మండలానికి చెందిన చందు అనేక పర్యాయాలు చిరంజీవి బ్లడ్ బ్యాంక్ పిలుపుమేరకు రక్తదానం చేశారు. రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్న అనేకమందికి పునర్జన్మ ఇచ్చినట్లు అవుతుందని ఆయన తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి పర్సనల్ మేనేజర్ గంగాధర్ రక్తదానం చేసిన చందును అభినందిస్తూ ప్రశంసించారు.



భవనంపై ఉన్న కటౌట్

పంచాయతీ భవనంపై టిడిపి నేతల కటౌట్

తెలుగుదేశం శ్రేణుల అత్యుత్సాహం

ప్రజాశక్తి -కోటవురట్ల: సీఎం చంద్రబాబు నాయుడు పర్యటనలో నేపథ్యంలో టిడిపి నేతలు అత్యుత్సాహం చూపారు. పాయకరావుపేట నియోజకవర్గం దార్లపూడిలో గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన లో భాగంగా టిడిపి శ్రేణులు నీలిగుంట పంచాయతీ కార్యాలయం పై రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత, స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఫోటోలతో కూడిన కటౌట్ కార్యాలయం పై ఏర్పాటు చేశారు. ఈ విధంగా చేయడంపై గ్రామ సర్పంచ్ వరహాల బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక ఎస్సై రమణయ్యకు, ఎంపీడీవో కాశీ విశ్వ నాథరావుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు ఏ చర్యలు తీసుకుంటారనేది వేచి చూడాలి.

పలు చోట్ల.. జనాభా దినోత్సవ ర్యాలీలు



గొలుగొండలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

ప్రజాశక్తి-గొలుగొండ: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కేడీపేట పిహెచ్‌సి వైద్యాధికారులు హరిప్రవీణ్, గాయిత్రిల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జనాభా పెరుగుదల కారణంగా ఎదుర్కొని సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఓ సత్యనారాయణ, హెచ్.వి.వరలక్ష్మి, ఇతర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ రాయవరం :అంతర్జాతీయ జనాభా దినోత్సవం సందర్భంగా సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని గ్రామాలలో అవగాహనా కల్పించినట్లు వైద్యాధికారి శక్తి ప్రియ తెలిపారు. ఎస్.రాయవరంలో జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు.ఆడ పిల్లలకు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాలతో పుట్టిన పిల్లలు అనారోగ్యంగా జన్మిస్తారని వైద్యాధికారి తెలిపారు. ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ, కుటుంబ నియంత్రణ పాటించడంతో జనాభా పెరుగుదలను నియంత్రించవచ్చునని పేర్కొన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జి .కొండ బాబు, ఎఫ్.డి.పి క్లస్టర్ పర్యవేక్షకులు డాక్టర్ పి.ఎన్.వి.ఎస్.ప్రసాద్,హెల్త్ సెక్రటరీ పి.నూకరత్నం, ఆశా కార్యకర్తలు, హెల్త్ సూపర్వైజర్ ప్రకాష్ పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శాస్త్రి, వైస్ ప్రిన్సిపల్ జయలక్ష్మి జనాభాపై మాట్లాడారు. అధ్యాపకులు నాగేశ్వరరావు, పులవర్తి పైడిరాజు, అప్పలనాయుడు, రాంకుమార్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం:ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అచ్యుతాపురం, హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యాన గురువారం వైద్య సిబ్బంది, పోలీసులు కలిసి ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. అధిక జనాభా నియంత్రణపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుల్లో వైద్యాధికారులు డాక్టర్ కె.శ్రావ్య, డాక్టర్ కళ్యాణి మాట్లాడుతూ జనాభా పెరుగుదల వలన కలిగే సమస్యలను వివరించారు. ప్రస్తుతం భారతదేశ జనాభా సుమారు 144 కోట్లు దాటుతుందని, ప్రతి ఒక్కరూ జనాభా నియంత్రణ పద్ధతులు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పిహెచ్‌సిల వైద్య సిబ్బంది వేణుగోపాల్, ఎస్.శ్రీనివాస్, సునీత, ఉమామహేష్, పి సన్యాసిరావు, రాజేశ్వరి, కె.నాగేశ్వరరావు, కె.గీతా రాణి, తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని కశింకోట, తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ తిరుపతిరావు, యు.రమేష్ ఆధ్వర్యంలో గురువారం ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. జనాభా పెరుగుదల వలన కలిగే అనార్థాలు వారు ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్యనారాయణ, సత్యవతి, విజయలక్ష్మి, ఎం.ప్రసాద్, ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట డిపిఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనాభా పెరుగుదల నియంత్రణపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌వి.అప్పారావు మాట్లాడుతూ జనాభా పెరుగుదలతో మానవ మనుగడకు ప్రశ్నగా మారుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌జెవి.ప్రసాద్, ఆచంట రవి, బి.అప్పారావు, ఆనంద్, వరలక్ష్మి, సుధారాణి, సునీత, శర్మ పాల్గొన్నారు.

డైట్‌లో ప్రపంచ జనాభా దినోత్సవం

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు డైట్ ప్రిన్సిపాల్ ఎం జ్యోతికుమారి మాట్లాడుతూ, అధికజనభా వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గొట్టేటి రవి,ఎల్ సుధాకర్, సోమయాజులు, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.



కశింకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో ఈనెల 12న శుక్రవారం పాములవాక సబ్ స్టేషన్ పరిధి పాములవాక, పీకేపల్లి, చిన్నబొడ్డేపల్లి, ఆక్రాహెబ్ పేట, రామన్నపాలెం, గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని మండల విద్యుత్ శాఖ ఇంజనీర్ మహేష్ తెలిపారు. చెట్టు తొలగింపు పనులు జరుగుతున్న సందర్భంగా ఈ గ్రామాల్లో విద్యుత్తు సరఫరా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

గొలుగొండ: మండలంలో కేడీపేట 11కెవి ఫీడర్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ సందర్భంగా ఈనెల 12న శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని నర్సీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణారావు తెలిపారు. జంగిల్ క్లియరెన్సు ఉదయం ఏడు గంటల నుంచి ప్రారంభిస్తారని, కావున ఆ సమయంలో చిన్నయ్యపాలెం, కొత్త మల్లంపేట, అమ్మపేట, గింజర్తి, చోద్యం, లింగంపేట, రామచంద్రపురం, తాళ్ళచీడికాడ, గుజ్జుమానుపాకలు తదితర గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులంతా ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని కోరారు.



బీజామృతం తయారు చేస్తున్న ట్రైనర్

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-గొలుగొండ : పంటల సాగులో రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడటంతో ఆరోగ్యకరమైన ఫలసాయాన్ని పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వరలక్ష్మి అన్నారు. మండలంలో ముంగర్లపాలెం, సి. హెచ్. నాగాపురం గ్రామాలలో రైతులతో ప్రకృతి వ్యవసాయ రిసోర్స్ పర్సన్ బీజామృతం తయారీ చేయించారు. రైతులకు బీజామృతంతో కలిగే ఉపయోగాలపై ఆమె అవగాహన కల్పించారు. విత్తనాలు బీజామృతం తో శుద్ధి చేయడంతో మొలక శాతం బాగా వస్తుందని, తెగుళ్లు రాకుండా ఉంటాయని రైతులకి వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పావని, బుచ్చమ్మ, పార్వతి, గంగ రైతులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిలో భవనం తొలగింపు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని అరుకు పంచాయతీ కేంద్రంలో జాతీయ రహదారికి అనుకుని నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని తొలగించాలని మూడు రోజుల క్రితం జాతీయ రహదారి అధికార యంత్రాంగంతో పాటు స్థానిక పంచాయతీ, రెవెన్యూశాఖ అధికార యంత్రాంగం కలిసి నోటీసులు జారీ చేశారు. నిర్మాణదారులు నిర్దేశించిన గడువులోగా తొలగించకపోతే తామే అధికారికంగా తొలగింపుకు చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు హెచ్చరించారు. దీంతో నిర్మాణదారుడు భవన నిర్మాణాన్ని గురువారం తొలగించారు.



తొలగిస్తున్న యజమానులు

సాగుదారులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని డిఎల్ పురంలో పేద సాగుదారులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యులు గింజాల వెంకటరమణ కోరారు. గురువారం పేద సాగుదారులతో సమావేశమయ్యారు. సాగుదారుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా అప్పలరాజు, గింజాల వెంకటరమణ మాట్లాడుతూ, గ్రామ రెవెన్యూ లో 85/1 నుండి 85/6 వరకు గల 102-70 ఎకరాల పేద సాగుదార్ల భూమిని వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో ప్రభుత్వం సేకరిస్తుందని తెలిపారు. పేదలు సాగు చేస్తున్న భూమికి ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరారు.సాగులో ఉన్న వారంతా నిరుపేదలని, వీరికి ఈ భూములు తప్ప వేరొక ఆధారం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, సిఐటియు మండల కన్వీనర్ ఎం.రాజేష్ పాల్గొన్నారు



మాట్లాడుతున్న అప్పలరాజు

ట్రిపుల్ ఐటికి ఇద్దరు విద్యార్థినుల ఎంపిక

ప్రజాశక్తి-కోటవురట్ల:కోటవురట్ల గర్ల్స్ హైస్కూల్‌లో పదవ తరగతి చదివిన విద్యార్థి యల్లపు రిషిత ట్రిపుల్ ఐటికి ఎంపికైంది. దీంతో, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

కొత్తకోట:రావికమతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన గుండా సుజనశ్రీ ట్రిపుల్ ఐటికి ఎంపికైంది. శ్రీకాకుళం జిల్లా క్యాంపస్‌కు సెల్కెక్టైంది. ఈ మేరకు హెచ్‌ఎం మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.



రిషిత, కోటవురట్ల



సుజనశ్రీ, రావికమతం

జి.మాడుగుల మండలంలో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండలంలో బోయితిలి, కిల్లంకోట పంచాయతీలోని పలు గ్రామాల్లో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ గురువారం సందర్శించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన కిల్లంకోట గ్రామంలో రహదారి నిర్మాణ పనులను పరిశీలించి, త్వరగా పనులు పూర్తి చేయాలని, నాణ్యత లోపం లేకుండా చూడాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.పలు పాఠశాలలను సందర్శించి పలు అంశాలపై విద్యాశాఖ అధికారులతో చర్చించారు. మద్ది గరువు వారపు సంతలో నిత్యావసర సరుకుల దుకాణాలను పరిశీలించి, నకిలీ వస్తువుల అమ్మకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డిగ్రీ ప్రవేశాలకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - మాడుగుల: 2024 - 25 విద్యా సంవత్సరానికి డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ కు ఈనెల 20వ తేదీ వరకు గడువు పొడిగించబడినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి ప్రకటనలో తెలిపారు. కళాశాల అత్యున్నత విద్యా అర్హత కలిగిన అనుభవజ్ఞులైన అధ్యాపకులతో అత్యాధునిక సాంకేతిక పద్ధతులలో విద్యాబోధన చేస్తున్నామన్నారు. ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ గ్రూపుల తోపాటు ఓపెన్ స్కూల్లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు డిగ్రీ ప్రవేశాలకు అర్హులన్నారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి-అనంతగిరి: పశువుల వ్యాధులను అరికట్టేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని కాశిపట్నం పశు వైద్య అధికారి సాగరి గణేష్‌శ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పినకోట పంచాయతీ వెలగలపాడు, బల్లగరువు, మల్లంపేట, చింతపాక, కివర్ల పంచాయతీ పూతికపుట్టు, జాలాడలో తదితర గ్రామాల్లో ప్రత్యేక పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధి బారిన పడిన పశువులకు చికిత్స అందిచామన్నారు. 248 పశువులకు లంపి చర్మవ్యాధి నిరోధక టీకాలు, 38 గేదెలకు గొంతువాపు, 590 మేకలకు చిటుకు, 76 గొర్రెలకు నీలి నాలుక నిరోధక టీకాలు వేశామన్నారు. వర్షాకాలంలో పశువులకు సోకే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పినకోట, కివర్ల ఎంపీటీసీలు, జూనియర్ వెటర్నరీ అధికారిణి సుధావాణి, పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

విత్తన శుద్ధి చేయాలి

ప్రజాశక్తి-గొలుగొండ: వరి నారు వేసే ముందు రైతులు విత్తన శుద్ధి చేయాలని జిల్లా వనరుల కేంద్ర ఏడిఏ శ్రీధర్ సూచించారు. మండలంలోని కొత్తమల్లంపేట రైతు భరోసా కేంద్రంలో గురువారం రైతులకు ఆత్మ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం, సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతి పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విత్తనాల బస్తా కొనుగోలు చేసిన రైతులు వంద గింజలను తీసుకొని మొలక కట్టి, మొలక శాతాన్ని పరీక్షించాలన్నారు. 80 శాతానికి మించి మొలక కడితే మంచి విత్తనంగా పరిగణించవచ్చునన్నారు. విత్తన శుద్ధికి కిలో విత్తనాలకు మూడు గ్రాముల కార్బెండిజం 50శాతం మందును కలిపి 24 గంటల తరువాత నారుమడిలో చల్లాలన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పంటలను ఎంచుకొని రైతులు సాగు చేసుకోవాలని ఆయన సూచించారు. పంటలకు వినియోగించాల్సిన ఎరువులు యాజమాన్య పద్ధతులపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఏడిఏ శ్రీదేవి, డిఆర్‌సి ఏఓ విజేత, గొలుగొండ ఎవో సుధారాణి , మాకవరపాలెం ఏవో చిరంజీవి, వ్యవసాయ శాఖ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రజారోగ్య వేదిక, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన మెడి కవర్ హాస్పిటల్ సౌజన్యంతో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ స్త్రీల వ్యాధి నిపుణులు డాక్టర్ వై.ఎల్ నరసింగరావు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కోవిడ్ వచ్చిన తరువాత ముఖ్యంగా హృదయ సంబంధ, బిపి, షుగర్, కేన్సర్ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. ప్రారంభ దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే మంచిదన్నారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి టి.కామేశ్వరరావు మాట్లాడుతూ, రాబోయే కాలంలో ఈ రకమైన వ్యాధులు పెరుగుతాయని, వీటిని గుర్తించి చికిత్స తీసుకుంటే మరణాలు అరికట్టవచ్చన్నారు. శిబిరంలో సుగర్, ఈసిజి పెప్ మీటర్, తదితర పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ వైద్యులతో పాటు, సిఐటియు, మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎలిమినేటర్ మ్యాచ్‌లో వైజాగ్ వారియర్స్ విజయం

ప్రజాశక్తి-పిఎం పాలెం: ..వైజాగ్ వేదికగా ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్-3 ఎలిమినేటర్ మ్యాచ్‌లో వైజాగ్ వారియర్స్ జట్టు గెలుపొందింది. గురువారం మధ్యాహ్నం వైజాగ్ వారియర్స్, కోస్టల్ రైడర్స్ జట్లమధ్య జరిగిన మ్యాచ్‌లో ఎనిమిది వికెట్ల తేడాతో వైజాగ్ వారియర్స్ ఘనవిజయం సాధించారు. మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోస్టర్ రైడర్స్ జట్టు ఓపెనర్లు అర్జున్ టెండూల్కర్ 19, కెప్టెన్ షేక్ రషీద్ 9 బంతుల్లో 24 పరుగులు చేసి, ఔటవ్వగా, తర్వాత బ్యాటింగ్ వచ్చిన అభిషేక్ రెడ్డి చివరి వరకు బరిలో నిలచి 43 బంతుల్లో 42 పరుగులుచేయగా, మిడిల్ ఆర్డర్‌లో లేఖాజ్ రెడ్డి బ్యాట్ ఝుళిపించి 27 బంతుల్లో 43 పరుగులు చేయడంతో కోస్టర్ రైడర్స్ జట్టు 20 ఓవర్లులో 7 వికెట్లు కోల్పోయి 153 పరుగులు చేసింది.

భారీలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన వైజాగ్ వారియర్స్ జట్టులో ఓపెనర్ బి మునిష్ వర్మ 5 బంతుల్లో 13 పరుగులు చేసి మొదట్లోనే అవుట్ అయినప్పటికీ, అశ్విన్ హెబ్బర్ 51 బంతుల్లో 8ఫోర్లు, 1సిక్సుతో 67 పరుగులు చేశాడు. తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ కె.శ్రీకర్ భరత్ కెప్టెన్సీ ఇన్నింగ్స్ 47 బంతుల్లో నాలుగు ఫోర్లు, ఒక సిక్స్‌తో 58 పరుగులతో నాటౌట్‌గా నిలిచి, ఫినిషింగ్ షాట్ ఫోరుతో తన జట్టును గెలిపించారు. మిడిల్ ఆర్డర్‌లో గరిమెళ్ళ తేజ 12 బంతుల్లో 14 పరుగులు చేసి జట్టు విజయానికి కృషి చేశాడు.దీంతో వైజాగ్ వారియర్స్ జట్టు 19 ఓవర్లలోనే 2 నష్టపోయి 157 పరుగులు చేసి ఘన విజయం సాధించింది.



విజయోత్సాహంలో వైజాగ్ వారియర్స్ క్రీడాకారులు

సిఎం చంద్రబాబుకు వినతుల వెల్లువ



సిఎంకు వినతిపత్రాన్ని ఇస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి- నక్కపల్లి:జిల్లాలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇల్లులు మంజూరు చేయాలని కోరుతూ అక్రిడేషన్ కమిటీ సభ్యులు కొరడ చంద్రరావు, పలువురు జర్నలిస్టులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు గురువారం వినతిపత్రం అందజేసారు. ఎస్.రాయవరం మండలం దార్లపూడిలో పోలవరం ఎడమ కాలువ పరిశీలన చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చారు. ఈ మేరకు చంద్రరావు, పలువురు జర్నలిస్టులు సీఎం చంద్రబాబు దృష్టికి జర్నలిస్టుల సమస్యలను తీసుకువెళ్లారు. జర్నలిస్టులు ఇల్లులు లేక అద్దె గృహాల్లో ఉంటున్నారని, అద్దె చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.జర్నలిస్టుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించి, ఇల్లులు నిర్మించి ఇవ్వాలని, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ స్కూల్లో 50 శాతం రాయితీ సదుపాయం, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్లు ఇవ్వాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు.

పోలవరం కాలువ అలైన్మెంట్ మార్చాలని వినతి

సబ్బవరం : మండలంలోని వంగలి గ్రామం మీదుగా నిర్మించనున్న బాబు జగ్జీవన్ రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పోలవరం కాలువ నిర్మాణ అలైన్మెంట్‌ను మార్చాలని వంగలి సర్పంచ్ ఆకుల శ్రీహేమ, గ్రామస్తులు గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికే తమ గ్రామంలో ఏర్పాటు చేసిన ఇండియన్ మారిటైం యూనివర్సిటీ, పెట్రోలియం యూనివర్సిటీలకు 350 ఎకరాల భూమిని రైతులు నుండి ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. పోలవరం కాలువ నిర్మాణానికి రైతుల జిరాయితీ భూములు మీదుగా సర్వే చేసి గుర్తించడంతో రైతులు ఉన్న కొద్ది భూములు కూడా కోల్పోవడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల గ్రామస్తులు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడతారన్నారు. పాత అలైన్మెంట్ ద్వారా కాలువ నిర్మాణం చేపడితే అనకాపల్లి జిల్లా నుండి తాము వేరు చేయబడినట్లు ఉంటుందని వాపోయారు. ముఖ్యమంత్రి దీనిపై స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

అనకాపల్లి : జిల్లాలోని యస్ రాయవరం మండలం దార్లపూడి గ్రామం సమీపంలో పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ (పోలవరం ఎడమకాలువ)ను పరిశీలించడానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దార్లపూడి జిల్లా పరిషత్ స్కూల్ హెలిప్యాడ్ వద్ద మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, టిడిపి నాయకులు దాడి రత్నాకర్, మల్ల సురేంద్ర తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో చినబొడ్డేపల్లి

-అస్తవ్యస్తంగా రోడ్లు, కాలువలు- నిలిచిన ప్రభుత్వ భవనాల పనులు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలోని చినబొడ్డేపల్లి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చినబొడ్డేపల్లి సచివాలయం పరిధిలో 8 గ్రామాలు ఉన్నాయి. సుమారు 2300 జనాభా ఉంది. చిన్న బొడ్డేపల్లి పరిధిలో చినబొడ్డేపల్లి గ్రామ పరిధిలో ఆరు గ్రామాలు, అక్షాహెబ్ పేట పంచాయతీ పరిధిలో రెండు గ్రామాలు ఉన్నాయి. గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిన తరువాత ఆయా సచివాలయ పరిధిలో సచివాలయ భవనం, రైతు భరోసా, హెల్త్ సెంటర్, డిజిటల్ లైబ్రరీ, సహా జగనన్న కాలనీలు నిర్మాణాలు చేపట్టింది. ఇక్కడ 8 గ్రామాలకు సంబంధించి జగనన్న కాలనీలు 11 మాత్రమే



పిల్లర్ దశలో నిలిచిన డిజిటల్ లైబ్రరీ



అసంపూర్తిగా నిలిచిన సచివాలయ భవనం పనులు

పూర్తయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాలు ఒక్కటి కూడా నిర్మాణం పూర్తి కాకపోవడం విశేషం. చిన్న బొడ్డేపల్లి సచివాలయం గతంలో నిర్మించిన పంచాయతీ భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్, మహిళా పోలీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ గ్రామీణ ప్రాంతంలో రోడ్లు, కాలువల పరిస్థితి అధ్వానంగా ఉంది. చిన్న బొడ్డేపల్లి గ్రామంలో ఇందిరమ్మ కాలనీ ఇల్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆ సమయంలో నిర్మించిన ఇల్లు కూడా ఆన్లైన్ చేయడంతో కొత్తగా మంజూరు చేసుకునేందుకు వీలు కాకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ ఇళ్లలోనే బిక్కు బిక్కు మంటూ ప్రజలు కాలం వెళ్లదీస్తున్నారు. వీరంతా షెడ్యూల్ కులాలకు సంబంధించిన వారు కావడం విశేషం. గత టిడిపి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మేజర్ గోకులం పనులు కూడా అసంపూర్తిగా దర్శన మిస్తున్నాయి. కొత్త ప్రభుత్వం స్పందించి గ్రామ సమస్యలపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.